క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లకొమ్మలు తొలగించేందుకు గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ గోవిందు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భరత్ నగర్, కొత్త బస్టాండ్, దేవనగర్, టీచర్స్ కాలనీ, గాజుల పేట, తెలంగాణ చౌరస్తా, వెంకటరమణ కాలనీ, ఎస్సీ కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మండల స్థాయి క్రీడలకు ఎంపిక



కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బుధవారం 68 ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలకు ఎంపికలో వివిధ పాఠశాలల విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రసేనా రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ జితేందర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, గేమ్స్ కన్వీనర్ మోహన్, మురళి, కో–కన్వీనర్ అమ్రేష్, ఆనంద్ ఉన్నారు.

ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వెంకట్రమణ కాలనీలో పోతులూరి వీరబ్రహ్మం గారి ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మంగారి ఆలయంలో గురువారం కలశాల పూజ, ఊరేగింపు, శుక్రవారం ఉదయం ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

ఆరాధన ఉత్సవాలు

అయిజ: మండలంలోని వేణు సోంపురంలో వ్యాస తత్వజ్ఞ తీర్థుల ఆరాధన ఉత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తర ఆరాధన కార్యక్రమంలో భాగంగా వ్యాస తత్వజ్ఞతీర్థుల బృందవనాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు మరమ్మతు



అయిజ: మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మట్టివేసి మరమ్మతు పనులు బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న రోడ్డు మరమ్మతు పనులను పరిశీలించారు. రోడ్డుపై లోతైన గుంతలు పడడంతో ప్రయాణానికి ప్రతికూలంగా మారిందని, మరమ్మతులు చేయించి ప్రయాణానికి అనుకూలంగా చేస్తామన్నారు.


సౌండ్ సిస్టం వితరణ

ధరూరు: ఉప్పేరు ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి ఆది మల్లారెడ్డి గద్వాల కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నాడు. పాఠశాల ఉపాధ్యాయులకు తనవంతు సహకారం అందించాలని విద్యార్థులకు అవసరమయ్యే సౌండ్ సిస్టం కోసం రూ.20వేలు ఉపాధ్యాయులకు అందించారు. పాఠశాల తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఉన్నత చదువులు చదవాలి

గద్వాల అర్బన్: విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ ఫౌండర్ పరశురాముడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రెండో రైల్వేగేటులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు, స్కూల్ బ్యాగ్స్ అందజేశారు. హెచ్‌ఎం పుష్పలత, టీచర్ రాణి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

కుక్కల బెడద తీర్చరా..



అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీలోని 1వ వార్డులో ఉన్న అంబేడ్కర్ నగర్ కాలనీలో కుక్కల బెడద నివారించాలని చైతన్య యువజన సంఘం నాయకులు నాగన్న, రజనీబాబు, విజయ్, మునిస్వామిలు అధికారులను కోరారు. కాలనీలో 60 నుంచి 70 కుక్కలు రోడ్లపై తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. చిన్న పిల్లల ఆడుకోవడానికి, అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్తుంటారని, కుక్కలు అక్కడే సంచరిస్తుండటంతో తల్లిందండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను, పిల్లలను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో కాలనీ వాసులు బయటికి రావడానికి కుక్కలను చూసి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వీధి కుక్కలను తరలించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించరా?



రోడ్డుపై క్రయవిక్రయాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు



రోడ్డుపై నిర్మించిన రేకుల షెడ్డు

- రోడ్డు పైనే క్రయ, విక్రయాలు
- ఇరుకుగా మారిన ప్రధాన రోడ్డు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

అయిజ: అయిజ మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తయి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకరాలేదు. దీంతో పూలు, పండ్లు, కూరగాయలు, ఆహార ధాన్యాలు విక్రయించే వ్యాపారులు పట్టణంలోని ప్రధాన రోడ్డుపై క్రయ విక్రయాలు నిర్వహిస్తున్నారు. వ్యాపారం నిర్వహించేందుకు తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు ఏకంగా రోడ్డుపై పర్మినెంట్‌గా రేకులషెడ్లు నిర్మించారు. చిరు వ్యాపారులు ప్రధాన రోడ్డుకు ఇరువైపుల క్రయవిక్రయాలు జరుపుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాలు ఢీకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాల్లో వ్యాపారాలు సాగిస్తున్న వారు నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. వ్యాపార దుకాణాల ముందు ఉన్న ఖాళీ స్థలంలో చిరు వ్యాపారులు క్రయ విక్రయాలు చేస్తున్నారు. చిరు వ్యాపారుల నుంచి అద్దెదారులు నెలకు రూ.3 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు రోడ్డుపై శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. చిరువ్యాపారులను రోడ్డుపైనుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై క్రయ విక్రయాలు నిలిపేయాలి



అయిజ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం పూర్తయినా చిరు వ్యాపారులు ప్రధాన రోడ్డు పక్కన క్రయవిక్రయాలు చేస్తున్నారు. దాని వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుంది. దాని వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– నజీర్, అయిజ

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి



అయిజ పట్టణంలో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడంతో చిరు వ్యాపారులు రోడ్ల పక్కన క్రయవిక్రయాలు చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తేవాలి.

– వీరేష్, పండ్ల వ్యాపారి, అయిజ

అధికారులు ఆదేశాలిస్తే తీసేస్తాం..



రోడ్డుపై చిరు వ్యాపారులు క్రయ విక్రయాల వల్ల వాహనదారులు బైక్‌లను, కార్లను నడిరోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. దాని వల్ల రోడ్డు బ్లాక్ అవుతోంది. తరచుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు ఆదేశిస్తే రోడ్డుపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్లు, షెడ్లను తొలగిస్తాం.

– విజయ భాస్కర్, సబ్‌ఇన్‌స్పెక్టర్

త్వరలో నిర్మాణం తొలగిస్తాం..



రోడ్డుపై చిరు వ్యాపారులు పండ్లు, కూరగాయలు, పూలు తదితర వస్తువులను విక్రయిస్తున్నారు. రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్‌కు ఇరు వైపులా 50 అడుగుల దూరం ఎలాంటి క్రయ, విక్రయాలు చేయరాదు. కొంతమంది రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోగా, మరి కొందరు శాశ్వతంగా షెడ్లు నిర్మించుకున్నారని ఫిర్యాదులొచ్చాయి. త్వరలోనే వాటన్నింటిని తొలగిస్తాం.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్

వీఆర్‌ఏల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

అయిజ: వీఆర్‌ఏల సమస్యలపై బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే విజయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం ఇచ్చిన జీఓ 81, 85 వల్ల నష్టపోయి ఒకనెల జీతం కూడా తీసుకోకుండా రిటైర్మెంట్ అయ్యారని తెలిపారు. వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు సవారి, వెంకటేష్, పరమేష్, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

కనులపండువగా శోభాయాత్ర



శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు

అయిజ: కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి హిందూ జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో పర్దీపురంలో బుధవారం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలతోపాటు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి శ్రీకృష్ణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణయ్యచారి, పాండురంగాచారిలు స్వామివారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి బిందెసేవ, పంచామృతాభిషేకం, పారువేట కార్యక్ర మం నిర్వహించారు. భజన మండలి సభ్యులతో ప్రత్యేక భజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం



అమరవీరులకు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు, కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో విద్యుత్ ఉద్యమంలో అమరులైన పోరాటవీరులకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు పూర్తిగా వెనుకబడ్డాయన్నారు. అమరుల స్ఫూర్తితో నేడు విద్యుత్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడానికి వ్య తిరేకంగా ప్రజలు సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ, కార్మికులు ఆంజనేయులు, ఎల్లప్ప, వెంకటరాజ, రామాంజనేయులు, గజేంద్ర, విష్ణు తదితరులు ఉన్నారు.

వలస కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సల్కాపురం క్రషర్‌ను పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

గట్టు: సల్కాపురం సమీపంలోని క్వారీలో పేలుళ్ల దాటికి బండరాళ్ల మీద పడి మృతి చెందిన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రొక్లెయిన్ డ్రైవర్ విజయ్‌కుమార్ సింగ్ గోండు (34) కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం సల్కాపురం, జోకన్‌గట్టు గ్రామాల సమీపంలోని క్వారీలో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సీఐటీయూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వీవీ నర్సింహ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979 ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్మికులు పని చేస్తున్న ప్రాంతంలో సరైన సౌకర్యాలను కల్పించడం లేదని, తద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ నిర్వహించే పేలుళ్ల దాటికి చుట్టు పక్కల గ్రామాల్లోని కొన్ని ఇండ్లు నెర్రెలు బారినట్లు తెలిపారు. క్రషర్ మిషన్ యజమానుల నిర్లక్ష్యం వల్ల వలస కూలీ ప్రాణాలు పోయాయని, బాధిత కుటుంబాన్ని క్రషర్ యజమాని రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, వీరేష్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపంపై చర్యలు తీసుకోండి



మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని భరత్‌నగర్, టీచర్స్ కాలనీ, నరసింహ కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించిందని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత వారంలో కురిసిన వర్షాల వల్ల వివిధ కాలనీల్లో మురుగు ఏర్పడిందని, దుర్వాసన వెదజల్లుతోందన్నారు. స్పందించిన ఇన్‌చార్జ్ కమిషనర్ చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రదీప్ కుమార్, వెంకటేష్, లక్ష్మణాచారి, లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్, రఘు, భీమేష్, ఇబ్రహీం పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ఉండవెల్లి: 'అతివలకు అండగా' శీర్షికతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతుల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై బుధవారం షీ టీమ్ పోలీస్ సంతోషమ్మ, కానిస్టేబుల్ రాఘవేంద్ర, ప్రధానోపాధ్యాయులు హేమలతలు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీడీ శైలజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

డెంగీపై ప్రజలకు అవగాహన



ఉండవెల్లి: మండల కేంద్రంలోని పల్లె దవాఖానలో ఆధ్వర్యంలో జిల్లా వైద్యులు సుమిత్ చంద్రారెడ్డిలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌పై ప్రజలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. బుధవారం గ్రామంలోని బస్టాండ్ వద్ద డెంగీ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రన్న, అక్కమ్మ, బాలేశ్వర్ శెట్టి, సుభాషిణి, బాల్‌రాజు, ఆశాలు పాల్గొన్నారు.

తైలాభిషేక పండుగ

ధరూరు: ప్రతి మానవుని మనస్సు పాపకరమైందని, దైవ చిత్తానుసారమైన మనస్సు కలిగి ఉండాలని.. అప్పుడే దేవుని దీవెనలు, ఆశీర్వాదాలు పొందగలమని అనంతపురం జిల్లా గుత్తి స్వస్థత శాల నిర్వాహకులు రెవ.అద్భుతకుమార్, టీవీ ప్రసంగీకులు పాస్టర్ హనోక్ రాజ్‌లు అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని గుత్తి చర్చి మైదానంలో 'తైలాభిషేక పండుగ' సభలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టరమ్మ మణికుమారి ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

రాజోళి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్న పెద్దన్న(50) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం వారం రోజులుగా ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన, కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



అలంపూర్ రూరల్: 1991–92లో 10 విద్యార్థులు తోటి మిత్రుడు గుండెపోటు వల్ల మృతి చెందడం వల్ల బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని యాపల్‌దేవిపాడ్ గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ బెంగుళూర్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పదిరోజుల క్రితం బంధువుల పెళ్లి ఉండడంతో సొంత గ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో గుండెపోటుతో మృతి చెందాడు. మిత్రులందరూ కలిసి రూ.20వేలు మిత్రుడి భార్య సోమేశ్వరమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సంధ్య పోగు మద్దిలేటి, రామకృష్ణ, యేసేపు, ఎరుకలి నాగరాజు, బొజ్జన్న, మౌలాలి, తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్





జిల్లా కేంద్రంలోని ధరూరు మెట్టు రోడ్డులో పాత నంబర్లతో దర్శనమిస్తున్న బోర్డు

'మీరు సంప్రదిస్తున్న నంబర్ పనిచేయడం లేదు'

పోలీస్‌శాఖలో జిల్లా స్థాయి నుంచి ఎస్ఐ స్థాయి వరకు, పరిపాలన విభాగంలో పని చేస్తున్న అధికారులకు కొత్త నంబర్లు కేటాయించారు. దీంతో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు పోలీసులకు సమాచా రం అందించేందుకు ఎస్ఐ, సీఐ స్థాయి పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు పనిచేయడం లేదు. కారణం బోర్డులపై అధికారుల పాత నంబర్లే ఉన్నాయి. ఇటీవల పోలీసు అధికారులకు కొత్త నంబర్లు కేటాయించారు. వాటిని బోర్డులపై ఏర్పాటు చేయలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ అధికారులకు ఫోన్ చేస్తే 'మీరు సంప్రదించే నంబర్ అందుబాటులో లేదు' అని సమాధానం వస్తోంది. ఇకనైనా పోలీసులు అధికారులు పని చేసే నంబర్లను బోర్డులపై ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– గద్వాల అర్బన్

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఐడీఓసీ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

గద్వాల అర్బన్: వీఓఏలకు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి, నాయకులు కృష్ణవేణి, తులసీ, లక్ష్మన్న, తిరు మల్, తిమ్మప్ప, సురేష్, తదితరులు ఉన్నారు.

జానపద కళను పోషిద్దాం



కేక్ కట్ చేస్తున్న జానపద కళాకారులు

అయిజ: జానపద కళను పోషిద్దామని జిల్లా జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ ఆచారి, కార్యదర్శి తిమ్మప్పలు అన్నారు. ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని సంకాపురంలో జానపద కళాకారులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ ఆచారి మాట్లాడారు. ప్రభుత్వం కళాకారులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, బస్సు, రైళ్లలో ప్రయాణించేందుకు రాయితీ అవకాశం కల్పించాలని కోరారు. కళాకారులకు 50 ఏళ్లకే పింఛన్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జానపద కళాకారుల సంఘం సంయుక్త కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి రాజు, అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల అధ్యక్షులు గోవింద్ గౌడ్, వెంకటేష్ యాదవ్, వెంకట్రాములు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలతో ముందుకెళ్లాలి



పార్టీలో పాల్గొన్న ఎంఈఓ శివప్రసాద్, ఎస్ఓ

మానవపాడు: మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ శివప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రతి కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ సంబరంగా నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఆనందంతో పాటు లక్ష్యాలు నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఓ అనురాధ, ఉపాధ్యాయునిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



గట్టు: మండలంలోని రాయాపురంలో పంట పొలాలను వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి పరిశీలించారు. పత్తి పంటలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించ వచ్చని వ్యవసాయ అధికారి తెలిపారు. పత్తి పొలంలో పచ్చ పురుగు, లద్దె పురుగులను గుర్తించినట్లు తెలిపారు. పంటలో చీడపీడలను ఎప్పటికప్పుడు గమనించి, నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

30న చలో ఎస్‌పీడీ కార్యాలయం

ధరూరు: కేజీబీవీ, ఉర్దూ మీడియం, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు బేసిక్ పే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న నిర్వహించే చలో ఎస్‌పీడీ కార్యాలయం విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, కృష్ణలు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలతో పాటు మోడల్ స్కూళ్లను వారు సందర్శించి నాన్ టీచింగ్ వర్కర్లతో మాట్లాడారు.

గద్వాల రూరల్: కేజీబీవీ, యూఆర్ఎస్, మోడల్ స్కూల్ హాస్టళ్ల నాన్‌టీచింగ్, వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ప్రధాన కార్యదర్శి కృష్ణ తెలిపారు. మండలంలో గోన్‌పాడులోని కేజీబీవీలో కరపత్రాలు విడుదల చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ సూచించారు. ఎగువ రాష్ట్రాలలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల జూరాల ప్రాజెక్టుకు అధికంగా వరద నీరు వస్తుందన్నారు. దీంతో జూరాల నుంచి 45గేట్ల ద్వారా మూడు లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు వదలడంతో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోందన్నారు. నది సమీపంలో ఉండే వివిధ గ్రామాల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.